అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 17 ఆగస్టు 2026 పేజీలు : 04

### 2025 ఓటర్ల జాబితాతోనే

# స్థానిక ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల సంఘం సిద్ధం..?




- ❖ ఏర్పాట్లు ముమ్మరం చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ❖ ఈ మేరకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటర్ల జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు
- ❖ స్థానిక సంస్థలకు అక్టోబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ప్రభుత్వం
- ❖ రిజర్వేషన్లపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం

**అనంతపురం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)వాటిని తుది ఓటర్ల జాబితాలతో కాకుండా, 2025 నాటి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ఓటర్ల జాబితాల ఆధారంగా నిర్వహించుటకు ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నట్లు సమాచారం.అక్టోబరు 3న సర్ తుది ఓటర్ల జాబితాలు ప్రచురించనున్నారు. ప్రామాణికంగా తీసుకుని స్థానిక సంస్థల్లో ఓటర్ల జాబితాలు ప్రచురిస్తే ఎన్నికల నిర్వ హణలో జాప్యమవుతుందని భావిస్తున్నారు. ఈ కారణంతో 2025 నాటి జాబితాలకే రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఈ మేరకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటర్ల జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థలకు అక్టోబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ప్రభుత్వం ఉందన్న సమాచారంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. బీసీ రిజర్వేషన్లకుసంబంధించి డెడికేటెడ్ కమిషన్ శుక్రవారమే నివేదిక ఇచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందంటే ఎన్నికలు సమీ పించినట్లుగానే భావించాలని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యం లోనే ఓటర్ల జాబితాల ప్రచురణ.. మున్సి పాల్టీల్లో వచ్చే నెల 3లోగా, ఇప్పటివరకు జాబితా సిద్ధంచేయని సుమారు యాభై పంచాయతీల్లో ఈ నెల 17లోగా పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలను ఎన్నికలసంఘంఆదేశించింది. పంచాయితీల్లో పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటికి సంబం ధించిన పబ్లికేషన్ ప్రక్రియ కూడా ఈ నెల 21 నుంచి 31లోగా పూర్తి చేయాలని సూచించింది. అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం ఇతర రాష్ట్రాలకు రాష్ట్ర ఎన్నికల కమి షనర్ ఇప్పటికే లేఖలు రాశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఇతరత్రా ఏర్పాట్లు 3045 రోజుల్లో పూర్తి చేయాలన్న యోచనతో ఎన్నికల సంఘం ఉంది.

### మండల వ్యాప్తంగా

# భూ అక్రమ రిజిస్ట్రేషన్ల కలకలం

- ముడుపుల మాయలో భూ అక్రమ రిజిస్ట్రేషన్లకు తెర లేపుతున్న రిజిస్టర్ సిబ్బంది
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న భూ అక్రమ రిజిస్ట్రేషన్లు
- బాధితులు తిరగబడటంతో రిజిస్ట్రేషన్ క్యాన్సిలేషన్ కు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి క్యు కడుతున్న అక్రమార్కులు

**బ్రహ్మసముద్రం ఆగస్టు 16 ప్రభాతవార్త** బ్రహ్మసముద్రం మండలంలోని పలు గ్రామాలలో భూ అక్రమ రిజిస్ట్రేషన్ ల కలకలంతో రైతులు తమ భూములు ఉన్నాయా లేదా అని చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది మండలంలోని పడమటి కోటిపల్లిలో భూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకొన్న నేతలు ఎక్కడున్నాడో తెలియని చనిపోయిన వ్యక్తి పేరు మీద నకిలీ మరణ ధ్రువపత్రం నకిలీ వంశ వృక్షం తో 23 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బయటపడింది. గత 40 సంవత్సరాలుగా భూమిపై ఉన్న రైతులు తిరగబడి కలెక్టర్కు ఫిర్యాదు చేయడంతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులను సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది పిలిపించుకొని తమ ఉద్యోగాలు పోతాయి అన్న భయపడ్డా సిబ్బంది అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్ రద్దు చేశారు. ఇదే పడమటి కోడిపల్లి బాటలో మండలంలోని నాగిరెడ్డిపల్లి లో భూ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని విషయం తెలుసుకున్న రైతులు నిలదీయడంతో రిజిస్ట్రేషన్ ను రద్దు చేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూ అక్రమ రిజిస్ట్రేషన్ లో ఒక్కొక్కటిగా బయటపడుతున్న వేళ రైతుల్లో ఆందోళన నెలకొంది రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక్క అక్షరం తప్పు ఉన్న సామాన్యులకు రిజిస్ట్రేషన్ చేయని రిజిస్టర్ అక్రమార్కులకు కొమ్ముకాస్తూ నకిలీ పత్రాలు సమర్పించిన ముడుపుల మాయలో అక్రమ రిజిస్ట్రేషన్లకు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది సహకరిస్తుందని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన అధికారులపై ప్రభుత్వం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా మరోసారి అక్రమ రిజిస్ట్రేషన్ జరగకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

### నాలుగు సార్లు నన్ను గెలిపించారు..

# మీకు ఏం ఇచ్చినా తక్కువే

- సీఎంఆర్ఎఫ్ చెక్కులు 52మందికి రూ.54.39లక్షల పంపిణీ చేసిన ఎమ్మెల్యే.
- ఇంటింటికీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచన.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** నాలుగు సార్లు నన్ను గెలిపించి ఎమ్మెల్యేగా చేసిన ప్రజలకు, కార్యకర్తలకు ఏం ఇచ్చినా తక్కువేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతఅన్నారు. అనంతపురంలోని తన క్యాంప్,కార్యాలయంలో ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన 52మందికి రూ.54.39లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు, మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రెండేళ్లలో 1430 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.11 కోట్లు అందజేసినట్టు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున సాయం అందలేదన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్న వారికి ఇది ఎంతగానో ఊరటనిస్తోందన్నారు. నా వద్దకు ఎవరైనా సరే ఈ సాయం కోసం వస్తే కాదనకుండా ముఖ్యమంత్రి వద్దకుఫైల్,తీసుకెళ్తున్నానని చెప్పారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేయడమే కాకుండా. ఇలా వ్యక్తిగతంగా కూడా సాయం చేయడం నా బాధ్యత అన్నారు. ఏ కార్యకర్త, నాయకుడికైనా సరే ఏ కష్టం వచ్చినానేనుఉంటానన్నారు.

**ఇంటింటికీ కార్యక్రమాన్ని వేగవంతం చేయండి....**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సునీత పార్టీ నాయకులకు ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న డోర్ టూ డోర్ కార్యక్రమం, సర్ ప్రక్రియ మీద సమీక్ష నిర్వహించారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో 100 ఇళ్ల కంటే తక్కువ తిరిగిన బూత్ ల గురించి, ఇప్పటి వరకు 50శాతం లోపు ఉన్న వాటి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా.. ఎందుకు ఇంత నెమ్మది సాగుతోందని ఆరా తీశారు. పార్టీఏదైనానిర్దేశించినప్పుడు దానిని కచ్చితంగా చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా అందజేసిన నోటీసులను పరిశీలించి వివరణ ఇవ్వాలని, ఓటరు జాబితాలో తప్పులు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా ఓట్లు కోల్పోయి ఉన్నా... లేదా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు.

## కాంగ్రెస్‌ను దిమాగీ నక్సల్స్ కాంగ్రెస్ పార్టీగా మార్చుకోండి


విష్ణువర్ధన్ రెడ్డి

**పుట్టపర్తి టౌన్,ఆగస్టు 16, ప్రభాతవార్త** కాంగ్రెస్ పార్టీపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకుని దిమాగీ నక్సల్స్ కాంగ్రెస్ పార్టీగా పేరు మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. పారామిలటరీ దళాలు, గిరి జనులను బలితీసుకున్న నక్సలిజాన్ని సమర్థించేలా కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం చేసిన దిమాగీ నక్సల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అసలు వైఖరిని బయటపెట్టాయని విమర్శించారు. భారత అణు కార్యక్రమం నుంచి డిజిటల్ విప్లవం వరకు దేశం సాధించిన విజయాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తూ వచ్చిందని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు.

**ఎన్డీఏ ప్రభుత్వంతో రాయలసీమ అభివృద్ధికి మరో మైలురాయి.. ముదిగుబ్బ-కదిరి ఎన్ హెచ్42 విస్తరణకు 679.71 కోట్ల మంజూరు..**

శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ-కదిరి మధ్య జాతీయ రహదారి 679.71 కోట్ల వ్యయంతో 4లేన్ల రహదారిగా విస్తరించి, బలోపేతం చేయాలని నేడు నిధులు విడుదల చేసి ప్రకటించారు. నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు యస్. విష్ణువర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు బెంగళూరు- విజయవాడ- కోల్‌కతా ఎక్స్‌ప్రెస్‌వే, తిరుపతి, చెన్నై నగరాలతో వేగవంతమైన రహదారి అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, సరుకు రవాణా సులభతరం అవుతుందని, ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రాంతీయ లాజిస్టిక్స్, పరిశ్రమలు, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు విశేష ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగంగా అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

### తాడిపత్రిలో నిశ్చితార్థ వేడుకల్లో

# వైసీపీ, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

- జె.సి ప్రభాకర్‌రెడ్డిపై దూసుకొచ్చిన వైసిపి నాయకులు ఇగుడూరు రామచంద్రారెడ్డి - ఘర్షణలో కారు అద్దాలు ధ్వంసం
- జె.సి ప్రభాకర్‌రెడ్డికి నచ్చచెప్పిన మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి - సిఐ నారాయణరెడ్డి చొరవతో తప్పిన పెద్ద వివాదం



నిశ్చితార్థ వేడుకకు హాజరైన మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, జె.సి దివాకర్‌రెడ్డి, నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న జె.సి ప్రభాకర్‌రెడ్డితో మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి



ఘర్షణలో ధ్వంసమైన కారు అద్దాలు, జె.సి ప్రభాకర్‌రెడ్డికి నచ్చచెబుతున్న మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 16 ప్రభాతవార్త** తాడిపత్రిలో ఓ వివాహ నిశ్చితార్థ వేడుకల్లో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో కావేరిసముద్రంకు చెందిన హనుమంతరెడ్డి వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

కావేరిసముద్రానికి చెందిన సంజీవరెడ్డి కుమారుడు నిశ్చితార్థ వేడుకను ఆదివారం కడప రోడ్డులోని ఎస్ఆర్‌టి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. కావేరిసముద్రం సంజీవరెడ్డికి రాజకీయంగా వైసిపి, టిడిపి నాయకులతో బంధుత్వాలు ఉన్నాయి. కావేరిసముద్రం సంజీవరెడ్డి తండ్రి పుల్లారెడ్డి తాడిపత్రి మండలంలో మంచి పేరు గల నాయకుడు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఆయన ఫ్యాక్షన్ గొడవల్లో మృతి చెందారు. ఆయనకు ఇరువురు కుమారులు. సంజీవరెడ్డితో పాటు శ్రీరామిరెడ్డి కావేరిసముద్రం సర్పంచుగా పని చేస్తూ ప్రస్తుతం తెలంగాణలోని తాండూరులో నివాసం ఉంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి సన్నిహితులు. తన సోదరుడు కుమారుడు నిశ్చితార్థ వేడుకలకు ఆయన కుటుంబసభ్యులతో సహా హాజరయ్యారు. ఆయనతో పాటు వైఎస్ఆర్‌సిపిలో ఉన్న కందిగోపుల మురళిప్రసాద్‌రెడ్డి, ఇగుడూరు మాజీ సర్పంచు రామచంద్రారెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు హాజరుకాగా, రాష్ట్ర మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి జె.సి దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు టిడిపి నాయకులు హాజరయ్యారు. ఈ సమయంలో నిశ్చితార్థ వేడుకల్లో మొదటి వరుసలో ఉన్న కందిగోపుల మురళిప్రసాద్‌రెడ్డిని చూసి జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇతన్ని బయటికి పంపమని సంజీవరెడ్డికి సూచించారు. అనంతరం శ్రీరామిరెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వెళ్లి బాగున్నారా అంటూ పలకరించగా అతనిని కూడా బయటికి పంపండి అని చెప్పారు. హనుమంతరెడ్డిని తనకున్న చనువుతో కొద్దిగా హెచ్చరిస్తూ మాట్లాడడం జరిగింది. అందరూ మీరే ఉన్నారు. మేము ఎందుకంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ముందు వరుసనుంచి వెళ్ళిపోతూ మధ్యలో కూర్చున్నారు. ఆ సమయంలో పక్కకు వస్తున్న శ్రీరామిరెడ్డిని ఇగుడూరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి చేతులు పట్టుకొని జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు తన కుమారులతో కలిసి దూసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన జె.సి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా వారిని ఎదుర్కొనేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉన్న సిఐ నారాయణరెడ్డి ఇగుదురు రామచంద్రారెడ్డిని, ఆయన కుమారున్ని, వైసీపీ నాయకులను పక్కకు ఈడ్చిపడవేశారు. అనంతరం జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్ బయటకు వచ్చి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుని అక్కడ ఉన్న కారు అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ సమయంలో మంత్రి జనార్దన్‌రెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వచ్చి నచ్చజెప్పి ఆయనను ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఇంటికి పంపించారు.

జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా పెద్దఎత్తున టిడిపి నాయకులు, జె.సి అనుచరులు ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకొని ఘర్షణకు దిగిన వైసిపి నాయకులపై దాడి చేయడానికి ప్రయత్నించగా సిఐ నారాయణరెడ్డి టిడిపి నాయకులు ఎస్‌వి రవీంద్రారెడ్డికి ఉన్నతాధికారుల నుంచి ఫోన్లో మాట్లాడించగా వారు ఫంక్షన్ హాల్ వద్ద నుంచి వెళ్లిపోయారు. వైసిపి నాయకులను ఒక రూములో ఉంచి టిడిపి నాయకులంతా వెళ్లిన తర్వాత వారిని కడప జిల్లా వైపుకు పోలీసులు బందోబస్తుతో పంపించారు. జె.సి ప్రభాకర్‌రెడ్డికి హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డిలు ఒకప్పుడు ప్రధాన అనుచరులుగా ఉండేవారు. వారి మధ్య చెలరేగిన మనస్పర్ధలు వల్ల ప్రస్తుతానికి దూరంగా ఉన్నారు. ఫంక్షన్ హాల్ వద్ద ఘర్షణ జరుగుతుందన్న ఉద్దేశంతో టౌన్ సిఐ ఆరోహణరావు, పెద్దవడుగూరు సిఐ నరేందర్‌రెడ్డి, సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 16 ప్రభాతవార్త** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

**పుట్టపర్తి,ఆగస్టు 16: ప్రభాత వార్త** శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్) లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందనీ జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తారన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

# భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు...!

- ఆశాఢ మాసం, డాక్యుమెంట్ రైటర్ల సమ్మె ప్రభావం - ప్రభుత్వానికి రూ.56 కోట్ల 86 లక్షల 83 వేల ఆదాయం తగ్గింపు




**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త** ఆశాఢ మాసం, డాక్యుమెంట్ రైటర్ల సమ్మె ప్రభావంతో జిల్లాలో స్థిరాస్తుల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. ప్రభుత్వం ఇచ్చిన రెవెన్యూ వసూళ్ల లక్ష్యంలో రూ.56 కోట్ల 86 లక్షల 83 వేలు ఆదాయం తగ్గింది. అనంతపురం జిల్లాలో అనంతపురం అర్బన్, రూరల్, సింగనమల, తాడిపత్రి, యాడికి, పామిడి, ఉరవకొండ,గుత్తి, గుంతకల్లు, కనేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం లో సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో ఏప్రిల్ నుండి మార్చి వరకు రూ.474 కోట్ల 09 లక్షల 34 వేలు రెవెన్యూ వసూళ్లు చేయాలని ప్రభుత్వం జిల్లాకు లక్ష్యం ఇచ్చింది. అందులో ఆగస్టు 13 నాటికి జిల్లాకు రూ.196 కోట్ల 74 లక్షల 88 వేలు రెవెన్యూ వసూళ్లు చేయాల్సి ఉండగా..... అందులో కేవలం రూ.139 కోట్ల 88 లక్షల 05 వేలు మాత్రమే రెవెన్యూ వసూళ్లు అయింది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంలో రూ.56 కోట్ల 86 లక్షల 83 వేలు ఆదాయం తగ్గింది. అయితే జూలై 15 నుండి ఆగస్టు 12 వరకు ఆశాఢ మాసం వచ్చింది. ఆ మాసం ప్రారంభమైన తర్వాత పలువురు కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేస్తున్నారని తెలిసింది. ముఖ్యంగా కొత్త ఇళ్ల కొనుగోలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో శుభ ముహూర్తాల కోసం వేచి చూస్తున్న వారి సంఖ్య పెరిగింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతంతో పోలిస్తే రద్దీ తగ్గింది. అయితే రిజిస్ట్రేషన్ల తగ్గుదలకు ఆషాఢంతో పాటు మార్కెట్ పరిస్థితులు, ఆస్తుల ధరలు, రుణాల లభ్యత, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మార్పులు వంటి ఇతర అంశాలు కూడా కారణమవుతున్నాయని అధికారులు, రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు సహా పలు మార్పులు అమలు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే దీనివలన తమకు నష్టం వస్తుందని డాక్యుమెంట్ రైటర్లు భావించి రాష్ట్రవ్యాప్తంగా గత నెల 18 నుండి 31వ తేదీ వరకు సమ్మె నిర్వహించారు. ఇలా రెండు ప్రధాన కారణాల వలన రిజిస్ట్రేషన్లు సంఖ్య తగ్గడంతో ప్రభుత్వ ఆదాయం కూడా తగ్గిందని అధికారుల ద్వారా అందిన సమాచారం. ప్రస్తుతం ఆషాఢ మాసం ముగిసింది. శుభ ముహూర్తాలు ప్రారంభమైతే రిజిస్ట్రేషన్ల సంఖ్య మళ్లీ పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా పెండింగ్‌లో ఉంచిన కొనుగోలు నిర్ణయాలు తిరిగి కార్యరూపం దాల్చితే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లావాదేవీలు పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఆదాయం తగ్గిన మాట వాస్తవమే: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి మార్చి వరకు అనంతపురం జిల్లాకు రూ.474 కోట్ల 09 లక్షల 34 వేలు రెవెన్యూ వసూళ్లు చేయాలని ప్రభుత్వం లక్ష్యం ఇచ్చింది. అందులో ఏప్రిల్ నుండి ఆగస్టు 13 నాటికి రూ.139 కోట్ల 88 లక్షల 05 వేలు రెవెన్యూ వసూళ్లు అయింది. ఆశాఢ మాసం, డాక్యుమెంట్ రైటర్ల సమ్మె కారణాల వలన రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడంతో రూ.56 కోట్ల 86 లక్షల 83 వేలు ఆదాయం తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి చేరుకుంటాము.

02ATP27_02ATP27.qxd 16-08-2026 PM 10:18 Page 1



# ఎంఆర్‌పీఎస్ ఎంఎస్‌పీ మండల కన్వీనర్‌గా రాయంపల్లి రవి

**-మందకృష్ణ మాదిగ ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని వెల్లడి**



రాయంపల్లి రవి

ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఎంఆర్‌పీఎస్ ఎంఎస్‌పీ ఉరవకొండ మండల కన్వీనర్‌గా రాయంపల్లి గ్రామానికి చెందిన రవి ఎన్నికయ్యారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీను బలోపేతం చేయడానికి నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా సమితి అనంతపురం జిల్లా ఇంచార్జ్, జాతీయ అధ్యక్షులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ కో కన్వీనర్‌గా చిన్నముష్టూరు శివను ఎన్నుకున్నారు. నూతన కన్వీనర్ రాయంపల్లి రవి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి అప ్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ విడపనకల్లు, కూడేరు మండలాల అధ్యక్షులు బలరాముడు, విజయ్, వర్కింగ్ ప్రసిడెంట్ దాసరి గణేష్, సీనియర్ నాయకులు సోమశేఖర్, మారుతి, జయరాం, రాజశేఖర్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# రాకెట్ల తండాలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**-సీపీఐ సీనియర్ నేత వాలేనాయక్ దంపతుల జ్ఞాపకార్థం నిర్వహణ**



వైద్య శిబిరంలో రోగులను పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని రాకెట్ల తండా గ్రామంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన కనిపించింది. దివంగత సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ వాలేనాయక్, సాలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి మనవరాలు డాక్టర్ భానుప్రియ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరిగింది. శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కామ్రేడ్ వాలేనాయక్ కొడుకు భాస్కర్, కోడలు మాధవి, కుమార్తె సీతమ్మ, అల్లుడు రాములు నాయక్ మాట్లాడుతూ వాలేనాయక్ దంపతులు పేదలు, గిరిజనుల హక్కుల పరిరక్షణకు జీవితాంతం కృషి చేశారన్నారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. తాతయ్య జ్ఞాపకార్థం స్వగ్రామంలో వైద్య అందించడం ఎంతో ఆనందంగా ఉందని మనవరాజు డాక్టర్ భానుప్రియ అన్నారు.

# 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ సాధనలో పోరాట వీరులకు ఘన సత్కారం

- పాత పెన్షన్ సాధనకు పోరాడిన సత్యసాయి జిల్లా యుటీఎఫ్ నాయకులకు సత్కారం
- నిరాహార దీక్షలతో సాధించిన విజయం.. యుటీఎఫ్ పోరాట వీరులకు సన్మానం
- ఉద్యమ స్ఫూర్తికి ఘన సత్కారం.. సత్యసాయి జిల్లా యుటీఎఫ్ నాయకులకు గౌరవం



**విజయవాడలో యుటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సత్కారం పొందిన శ్రీ సత్యసాయి జిల్లా యుటీఎఫ్ నాయకులు**

ధర్మవరం ఆగస్టు 16 ప్రభాతవార్త

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం శ్రీ సత్యసాయి జిల్లాలో 2023లో నిర్వహించిన నిరాహార దీక్షలో పాల్గొని కీలక పాత్ర పోషించిన యుటీఎఫ్ నాయకులను విజయవాడలో ఘనంగా సత్కరించారు. యుటీఎఫ్ రాష్ట్ర కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పోరాట వీరుల విజయోత్సవ సభలో ఈ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రరెడ్డి, పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు జి.హెచ్. బాబు, సోమందేపల్లి మండల నాయకులు సోమశేఖర్‌లకు గోల్డ్ మెడల్స్, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపి మూర్తి, మాజీ ఎమ్మెల్సీలు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు, యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా సత్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా యుటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ..... యుటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పోరాటాలు, నిరాహార దీక్షల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించడం సుదీర్ఘ పోరాటంలో కీలక విజయమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన నాయకులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాట మార్గమే తగిన పరిష్కారమని రామకృష్ణ నాయక్ పేర్కొన్నారు. పాత పెన్షన్ సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషిని ఆయన కొనియాడారు.

# ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

ధర్మవరం, ఆగస్టు 16 ప్రభాతవార్త



**సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రాంభూపాల్‌రెడ్డి, అధికారులు.**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ...... గౌతు లచ్చన్న జీవితాన్ని, ఆయన ఆశయాలను నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజ అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు, పాటించిన సిద్ధాంతాలను ప్రజల్లోకి, ముఖ్యంగా విద్యార్థుల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు నిత్యవసర సరుకులతో చేయూత



సరుకులు ఇస్తున్న ఏఎన్ రావు తదితరులు

హిందూపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

పేద బ్రాహ్మణులను ఆదుకునేందుకు హిందూపురం తాలూకా బ్రాహ్మణ సంఘం శ్రీకారం చుట్టింది. సంఘం అధ్యక్షులు కొట్నూరు జ్యోతి ఆదినారాయణ రావు ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను అందించారు. పట్టణం మోడల్ కాలనీ లో నివాసం వున్న శేషగిరి రావు, గురుప్రసాద్ రెండు బ్రాహ్మణ కుటుంబాలు అత్యంత బీదరికం లో జీవనం సాగిస్తున్నారని తెలుసుకొన్న సంఘం అధ్యక్షులు ఆదినారాయణ రావు ఒక్కో కుటుంబానికి రూ. 6,000 చొప్పున విలువైన సరుకులను ఇవ్వడం విశేషం. కార్యక్రమం నందు కొటిపి నాగేశ్వరరావు, మురళి దేశాయి, రాజేంద్రప్రసాద్, శ్రీధర్, శ్రీనివాసరావు నాగరాజు, ఫణి భూషణ్, శంకరప్ప పాల్గొన్నారు.

# దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు



దివ్యాంగుల ఉచిత చికిత్సల కార్యక్రమంలో నాగళ్ళి

డి.హిరెహాళ్ ఆగస్టు 16 ప్రభాతవార్త



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ ను సన్మానిస్తున్న దృశ్యం

కర్ణాటక బళ్ళారి నగరంలో దివ్యాంగులకు నిర్వహించిన ఉచిత చికిత్సలు, ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజు పాల్గొన్నారు. ఆదివారం బళ్ళారి నగరంలోని నారాయణ సేవ సంస్థ, సన్మార్గ బలగ సంస్థల వారి సంయుక్తంగా దివ్యాంగులకు ఉచిత చికిత్సలు, ఉచిత అవయవాల పంపిణీ కార్యక్రమంలో ఆ సంస్థల ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆయన ముఖ్య అతిథిగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ రెండు సేవా సంస్థలు ఉమ్మడిగ 1500 మంది దివ్యాంగులకు ఉచిత చికిత్స, ఉచిత కృత్తిమ అవయవాలు పంపిణీ, అమర్చే కార్యక్రమములో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆ సంస్థల ప్రతినిధులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సెట్రూ శాంతి, ఆ సేవా సంస్థల ప్రతినిధులు, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

# రక్తదానంతో.. మరొకరికి పునర్జన్మ



రక్తదానం చేస్తున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

నేటి సమాజంలో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల మరొకరికి పునర్జన్మ ఇచ్చినవారు అవుతారని వైద్యులు పేర్కొన్నారు. ప్రముఖ నటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాల్దను పురస్కరించుకొని ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, చిన్న వెంకటేశులు, బోయగడ్డ బ్రహ్మయ్య, తిరుమలేష్, ధరణికుమార్, ఓబులేష్, ఈశ్వర్, రోహిత్, ప్రశాంత్, రఘు, రంగా, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగులచవితి వేడుకలు



నాగదేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాల్లో ఆదివారం నాగులచవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కోట ముఖ ద్వారం వద్ద ఉన్న ఓం శక్తి దేవస్థానంలో ఉన్న నాగుల కట్ట వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు గావించారు. పాలు, పూలు, పండ్లు తదితర నైవేద్యాలను సమర్పించారు. అదేవిధంగా గుత్తి ఆర్ఎస్‌లో సుందరయ్య కాలనీకి వెళ్లే ప్రాంతంలో ఉన్న నాగుల కట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

డి.హిరెహాళ్ ఆగస్టు 16 ప్రభాతవార్త



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్ఐ

డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించినట్లు కేసులు నమోదు చేసినట్లు ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ అందించిన వివరాల మేరకు ఆదివారం రాత్రి డి.హిరెహాళ్ మండల పరిధిలోని జాజరకల్ టోల్ ప్లాజా వద్ద డ్రంకన్ డ్రైవ్ నిర్వహించి ఒక కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరు మంది వ్యక్తులను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఉరవకొండ మండలంలో ఘనంగా నాగుల చవితి

**-నాగుల పుట్టలు, విగ్రహాలకు పాలు పోసిన భక్తులు**

ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త



నాగుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



నాగుల విగ్రహాలకు పాలు పోస్తున్న భక్తుల దృశ్యం

ఉరవకొండ మండల వ్యాప్తంగా స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం శ్రావణ మాసం నాగుల చవితి పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లోగల నాగుల పుట్టలు, విగ్రహాలకు ప్రజలు పాలుపోసి భక్తిప్రవర్తులను చాటుకున్నారు. నాగేంద్రుడు శివుడికి హారమై, కేశవుడికి తల్పమై పురాణాల్లో విశిష్టమైన స్థానం పొంది భక్తుల పూజలందుకొంటున్న విషయం తెలిసిందే. ఏడాదికి ఒకసారి నాగపూజచేసి పుట్టల్లో పాలుపోయడం కంకణాలు కట్టుకోవడం సాంప్రదాయంగా కొనసాగుతోంది. చవితి మొదలు నెలరోజులపాటు మంచి రోజుల్లో నాగపూజలు కొనసాగడం పరిపాటి. స్థానిక మండల పరిషత్ కార్యాయం వద్దగల నాగుల కట్టతోపాటు, గవిమఠం ఆవరణం, భక్త మార్కేండేయస్వామి ఆలయం, పార్కు ఆంజినేయస్వామి ఆలయం, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణం తదితర ప్రాంతాలు నాగులకు పాలు పోయడానికి వచ్చే భక్తులతో కిటకిటలాడింది.

# అవార్డు గ్రహిత సీఐ బి.మహానందికు ఘన సన్మానం

**-సేవలను కొనియాడిన ఎంఆర్‌పీఎస్ నాయకులు**

ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త



సీఐ బి.మహానందిను సన్మానిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు




సీఐ బి.మహానందిను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.మహానందిను వివిధ ఎంఆర్‌పీఎస్ సంఘాలు ఆదివారం ఘనంగా సన్మానించాయి. సీఐ బి.మహానంది 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా ఉత్తమ సీఐ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయాల్లో సీఐ బి.మహానందికు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఐ బి.మహానంది ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగానే కాకుండా రూరల్ సర్కిల్ సీఐగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకొని అవార్డు అందుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అంబేద్కర్ అవార్డు గ్రహిత యం.రాజు, నాయకులు మీనుగ పెద్దన్న, హెచ్.బసవరాజు, యం.పెన్నయ్య, యం.వన్నప్ప, ఉండబండ రాజు, శేఖర్, మందకృష్ణ మాదిగ ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తకోట ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి ఎం.ఎల్లప్ప, సీనియర్ నాయకులు మీనుగ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో విద్యా బోధకుల తాత్కాలిక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**ఎంఈఓ లు కృష్ణమోహన్, వెంకటేశ**

తాడిమర్రి ఆగస్టు 16 (ప్రభాతవార్త)



తాత్కాలిక పోస్టుల గురించి వివరిస్తున్న ఎంఈఓ లు కృష్ణమోహన్, వెంకటేశ్

మండలంలో ఖాళీగా ఉన్న విద్యా బోధకుల పోస్టులకు తాత్కాలికంగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు కృష్ణమోహన్, వెంకటేశులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని అందులో తాడిమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్, ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషియల్ స్కూల్ అసిస్టెంట్, మర్రిమేకలపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్ జి టి పోస్ట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ గా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీ ఈ డీ తోపాటు టెట్, పూర్తి అయి ఉండాలని అలాగే ఎస్జిటి పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డి ఈ డితో పాటు టెట్ పూర్తి చేసి ఉండాలని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు 12,500 వేల రూపాయలు, ఎస్ జి టి పోస్టుకు నెలకు10,000 వేల రూపాయల ప్రకారంజీతం చెల్లించడం జరుగుతుందని అన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 19వ తేదీ లోగా తమ దరఖాస్తులను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# ఉత్తమ అధికారిగా ఎంపికైన మండల స్వర్ణ గ్రామం అధికారి టి. రంగమన్నార్



**మంత్రి సవితమ్మ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఎమ్మెస్ జి ఎస్ డబ్ల్యు. అధికారి టి.రంగమన్నార్**

కనగానపల్లి ఆగస్టు 16 ప్రభాతవార్త

ఎంపీడీవో కార్యాలయంలో మండల స్వర్ణ,గ్రామం స్వర్ణ వార్డు అధికారి గా పనిచేస్తున్న టి.రంగమన్నార్ ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. ఈయనకు పుట్టపర్తి జిల్లా కేంద్రంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బిసి సంక్షేమ జౌళి శాఖమంత్రి వర్యులుఎస్. సవితమ్మ, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా టీ.రంగమన్నార్ ఈ అవార్డు ను అందుకున్నారు. ఈయన సచివాలయ వ్యవస్థలో ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా ప్రభుత్వ పథకాలను అందించే విధంగా సచివాలయ సిబ్బంది సమయపాలన వారి హాజరు శాతాన్ని మెరుగుపరిచినందుకుగాను ఈ అవార్డు ఆయనకు దక్కింది. ఈయనను ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# ఇంటింటా..101 రోజుల సత్య సాయి నామస్మరణ

సత్య సాయి బాబా శతజన్మ దినోత్సవ సందర్భంగా విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు ప్రారంభం.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.

గోరంట్ల ఆగస్టు 16 ప్రభాతవార్త.

శ్రీ సత్య సాయి బాబా శతజన్మ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నూట ఒక్కరోజుల నిరంతర పూజ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని సునీత విజయ్ కుమార్ దంపతుల నివాసంలో ఆదివారం మొదటిరోజు పూజ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ పూజ కార్యక్రమాల్లో సత్య సాయి జిల్లా భజన మండలి కన్వీనర్ విజయలక్ష్మి హాజరై పూజల్లో పాల్గొన్నారు. సత్య సాయి సేవ సదన్ మండల అధ్యక్షులు సుబ్బరాయుడు తదితరులు పూజల్లో పాల్గొని సత్య సాయి కీర్తనలు భజనలు వంటి కార్యక్రమాలు చేస్తూ సత్య సాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలన అభివృద్ధిపై... డోర్ టూ డోర్ ప్రచారం.

పాల్గొన్న మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, సింగిల్ విండో అధ్యక్షులు చంద్ర



కరపత్రాలు పంచుతున్న కన్వీనర్

గోరంట్ల ఆగస్టు 16 ప్రభాతవార్త



కార్యక్రమాల్లో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు.

గోరంట్ల మండలం లోని పాలసముద్రం పంచాయతీ బెల్లల చెరువు గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలకు టిడిపి మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి,పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లల చెరువు చంద్ర లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పార్టీ ముద్రించిన కరపత్రాలతో పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రైవేటు పెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్. జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గృహప్రవేశ వేడుకల్లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు

డి.హిరెహాళ్ ఆగస్టు 16 ప్రభాతవార్త



గృహప్రవేశ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు

నూతన గృహప్రవేశ వేడుకల్లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లాపురం వన్నూరుస్వామి పాల్గొన్నారు. ఆదివారం బళ్ళారి నగరంలో బిజెపి నాయకుడు వెంకటేష్ రెడ్డి గుగ్గరహట్టిలో నిర్మించిన నూతన గృహప్రవేశ వేడుకల కార్యక్రమం కు ఆయన డి.హిరెహాళ్ మండలంకు చెందిన బిజెపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, బోయ మల్లికార్జున, సురేష్ యాదవ్ లతో కలిసి హాజరై వెంకటేష్ రెడ్డి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం నూతన గృహ ప్రవేశ కార్యక్రమం పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగాడి మంజు, హావళద గంగాధర్, వసగుడ్డం మంజు, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి తొట్ల గంగాధర్ ఆర్థిక సాయం

పుట్టపర్తి, ఆగస్టు 16, ప్రభాతవార్త



**చింత భాస్కర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జనసేన పార్టీ నాయకులు తొట్ల గంగాధర్**

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఏనుములపల్లికి చెందిన జనసేన పార్టీ నాయకులు చింతా భాస్కర్ తీవ్ర అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు శనివారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు తొట్ల గంగాధర్ మృతుడి కుటుంబానికి రూ.10,000 లను అందించడంతోపాటు, మృతుని కుమార్తెలకి చదువులకు కూడా తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన కార్యకర్తలకి అందుబాటులో ఉంటూ, ఏ కార్యకర్తకి కష్టం వచ్చినా తోడుగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల కరుణాకర్, అయ్యా ఉమాపతి, సాయి సంతోష్, బండ్ల వెంకటేష్, అయ్యా నవీన్ కుమార్, ఎనుములపల్లి జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరంగా మారిన లయన్స్ క్లబ్ సేవలు

- ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు
- ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన




కంటిచూపు మందగించిన మహిళను పరీక్షస్తున్న డాక్టర్ జాస్ర.

**పామిడి ఆగస్టు 16: ప్రభాతవార్త**

ఆరోగ్యం పరంగా లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు నిరుపేదలకు వరంగా మారాయని ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి, ఆసంస్థ జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ వారు ఆదివారం ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యాలను పదిలంగా ఉంచాలన్న ఉద్దేశ్యంతో లయన్స్ క్లబ్ ద్వార అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉచిత కంటి మెగా వైద్యశిభిరాలు ప్రజల ఆరోగ్యం సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపాడుతాయని తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా చేపడుతున్న లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి వైద్యనిపుణురాలు డాక్టర్ జాస్ర కంటిచూపు మందగించిన 120 మందిని పరీక్షించి అందులో 57 మందిని ఆపరేషన్లకు రిఫర్ చేశారు. ప్రతిఒక్కరూ కళ్ళను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేయించుకోవటానికి వచ్చిన వారితో శ్రీ వాసవి కల్యాణ మండపం కితకిటలాడగా ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన లభించింది. కంటి పరీక్షలు చేయించుకోవటానికి వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు పత్రా శ్రీనివాసులు, నిర్వాహకులు ఆర్ఎంపీ వైద్యులు గంగశేఖర్, మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్, శంకరకంటి ఆసుపత్రి మేనేజర్ శివ, లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు



గౌతు లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త**

జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన యుగ నాయకుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షులు సురేంద్ర కుమార్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కుసుబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు రాజు గౌడ్, శ్రీశైలం సత్రం కమిటీ సభ్యులు భాస్కర్ గౌడ్, ఈడిగ సంఘం నాయకులు పాలచర్ల ఈశ్వరయ్య గౌడ్, నాయనపల్లి రాజు, టీచర్ నారాయణస్వామి, స్వరూప్ బాబు, శివానంద గౌడ్, చిన్న రాయుడు, లక్ష్మినారాయణ, చంద్రాయుడు, మల్లికార్జున గౌడ్, బల రాముడు, శివయ్య గౌడ్, శ్రీనివాస్ బాబు గౌడ్, రమేష్ గౌడ్, శ్రీశైలం శంకర్ గౌడ్, నారాయణ స్వామి గౌడ్, ప్రసాద్ గౌడ్, మధు గౌడ్, గాదిలింగ గౌడ్, తుమ్మల నారాయణ స్వామి, ప్రసాద్, వెంకటేష్, శ్రీరాములు, రామాంజనే యులు, కృష్ణమూర్తి, పరకాల వెంకటేష్, ఎస్సీ జన సంఘం నాయకులు దాసగానిపల్లి కుల్లాయప్ప, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.విష్ణువర్ధన్, బీసీ వెల్ఫేర్ సిబ్బంది ఈడిగ ఉద్యోగస్తులు, ఈడిగ కులస్తులు పాల్గొన్నారు.

# సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త**



సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రం పేట బైపాస్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధి కారిత అధికారి కార్యాల యంలో సర్దార్ గౌతు లచ్చన్న గారి చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈడీ బీసీ కార్పొరేషన్ అధికారి సుబ్రమణ్యం, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, కుల సంఘాల నాయకులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్న సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి ఖుష్బూ కొఠారి మాట్లాడుతూ..సర్దార్ గౌతు లచ్చన్న గారి ఆశయాలు, సామాజిక సేవా స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# విద్యా వాలెంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎంఈఓ నరసింహరాజు



ఎంఈఓ నరసింహరాజు

**శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త**

మండల పరిధిలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాలలో విద్యా వాలెంటీర్లను నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ మండల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులు శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్-1) వెస్ట్ నర్సాపురం స్కూల్ అసిస్టెంట్ (హిందీ-1), బండమీదపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (సోషియల్-1) ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 16 నుంచి 21వ తేది సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. పోస్టుల భర్తీలో ముందుగా సంబంధిత గ్రామానికి చెందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తారని, తర్వాత మండల అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. గ్రామం/మండలంలోని అభ్యర్థులు లభించని పక్షంలో ఇతర మండలాల అభ్యర్థులను పరిశీలించనున్నట్లు తెలిపారు. సంబంధిత పోస్టులకు (టెట్) అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఒక వేల టెట్ అర్హత కలిగిన వారు అందుబాటులో లేకపోతే అవసరమైన అకాడమిక్, ప్రొఫెషనల్ అర్హతలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగ కాలం 01-09-2026 నుంచి 30-04-2027 వరకు స్కూల్ అసిస్టెంట్ జీతం 12,500, అర్హత కలిగిన నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అంతర్ జిల్లా క్రికెట్ విజేతగా నిలిచిన కడప జట్టు

- 10 వికెట్లు సాధించిన కడప బౌలర్



10 వికెట్లు తీసిన కడప బౌలర్ షరీఫ్



సెంచురీ సాధించిన వీరా రెడ్డి

**అనంతపురం సిటీ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

ఆర్డిటి క్రీడా మైదానం వేదికగా జరుగుతున్న ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ టోర్నీలో విజేతగా కడప జట్టు నిలిచింది. కడప భౌలర్ పఠాన్ 10 వికెట్లు తీసి కడప విజయానికి కీలకంగా మారారు. కడప, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో కడప జట్టు 27 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 200 పరుగులు సాధించి డిక్లర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 49.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 202 పరుగులు సాధించింది. అయితే అత్యధిక రేటింగ్ ఆధారంగా కడప జట్టును విజేతగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో5 వికెట్లను పఠాన్ షరీఫ్ తీశారు. అదే విధంగా అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. నెల్లూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు కోల్పోయి 588 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురంజట్టు 59.4 ఓవర్లలో 339 పరుగులు సాధించి ఆల్ అవుట్ అయింది. అనంతపురం జట్టులో కెప్టెన్ వీరారెడ్డి 133 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్సులతో 122 పరుగులు సాధించారు. అదే విధంగా ఎం.కె.దత్తారెడ్డి 29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 47 పరుగులు సాధించారు. అదే నెల్లూరు జట్టులో సుబ్రహ్మణ్యం 194 బంతుల్లో 26 ఫోర్లు, ఒక సిక్సుతో 187 పరుగులు సాధించగా షాహుల్ అమీద్ 157 బంతుల్లో 17 ఫోర్లు, 8 సిక్సులతో 171 పరుగులు సాధించారు. విజేతగా నిలిచిన కడప జట్టును ఏడిసిప కార్యదర్శి శ్రీధర్ అభినందించారు. మ్యాచ్‌లను అబ్జర్బర్ అజంతుల్లా, సెలెక్టర్ ఎలీజన్, జోనల్ సెలెక్టర్లు సురేష్, రామ్మోహన్, సుధీర్ భూపతి, ముజీర్, నరేష్ తదితరులు పర్యవేక్షించారు.

# పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

**అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో**




ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని సూచించారు. క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్‌కు ఫీడ్ బ్యాక్ చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్‌ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్‌లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

# అనంతపురం జిల్లాలో ఎఫ్ఏ-I పరీక్షల షెడ్యూల్ విడుదల

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త**

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ఫార్మేటివ్ అసెస్మెంట్-1 (ఎఫ్ఏ-1) పరీక్షల షెడ్యూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.అయూబ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పరీక్షలను నిర్ణీత తేదీల్లో, నిర్దేశిత సమయాల్లో నిర్వహించాలని అధికారులు సూచించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఆగస్టు 17 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 17న తెలుగు (ప్రథమ భాష), గణితం, 18న ఇంగ్లీష్, పర్యావరణ శాస్త్రం, 19న ఓఎస్ఎస్సి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా 6, 7, 8 తరగతులకు ఆగస్టు 17న తెలుగు, గణితం, 18న హిందీతో పాటు సాంఘిక శాస్త్రం, 19న ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రం ఇతర సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఆగస్టు 20న ఓఎస్ఎస్సి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 9, 10 తరగతులకు కూడా ఆగస్టు 17 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తరగతి, మాధ్యమాన్ని బట్టి తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రం తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో పాఠశాలలు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలని అధికారులకు సూచించారు. 1 నుంచి 5వ తరగతులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను పాఠశాల సముదాయ స్థాయిలో, 6 నుంచి 10వ తరగతులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సిలలో సురక్షితంగా భద్రపరచాలని పేర్కొన్నారు. ప్రతి సెషన్‌కు ప్రశ్నపత్రాలను ఒక గంట ముందుగానే సంబంధిత పాఠశాలలకు అందజేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు. సిఆర్‌పిల సహకారంతో పరీక్షా సామగ్రి, ప్రశ్నపత్రాల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలని, పరీక్షల అనంతరం విద్యార్థుల సమాధాన పత్రాలను నిబంధనల ప్రకారం భద్రపరచాలని అధికారులు సూచించారు. విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ స్పష్టం చేసింది. విద్యార్థులు ముందుగానే పరీక్షల షెడ్యూల్‌ను తెలుసుకుని సిద్ధం కావాలని సూచించారు. ఎఫ్ఏ-1 పరీక్షలు ఆగస్టు 17 నుంచి ప్రారంభమై ఆగస్టు 20 వరకు కొనసాగనున్నందున, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలల ద్వారా పూర్తి షెడ్యూల్‌ను తెలుసుకుని పరీక్షలకు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు.

# నేడు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి

**ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్**

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 16 ప్రభాతవార్త**



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 ,30 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చునని తెలియజేశారు. అనంతపురం: 9154790350 ,శ్రీసత్యసాయి జిల్లా 9963707847,ఈ సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# అనంతపురం జిల్లాలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ ఫోరం కార్యవర్గ సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ కృష్ణారెడ్డి

**అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో**

ఎన్.హెచ్.ఆర్.పి.ఎఫ్ జాతీయ అధికార ప్రతినిధి కాంతి జాన్ వెస్లీ కార్యాలయం నందు ఆదివారం అనంతపురం సత్యసాయి ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశం, జాతీయ వైస్ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బిఎస్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 12వ తేదీ రాష్ట్ర సదస్సు అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఎన్.హెచ్.ఆర్.పి.ఎఫ్ నాయకులు, జాతీయ, రాష్ట్ర, సభ్యులు, హాజరై రాష్ట్ర సదస్సును దిగ్విజయం చేయవలసిందిగా కోరారు. అదే రోజు నూతన జిల్లా అధ్యక్షుడు మరియు జిల్లా మహిళా అధ్యక్షురాలును ఎన్నుకొని వారి చేత ప్రమాణస్వీకారం చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ అధికార ప్రతినిధి కాంతి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర సదస్సుకు సీఈవో తూము రామచంద్ర నాయుడు హాజరై పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని కావున రాష్ట్ర నాయకులు, ప్రత్యేకంగా అనంతపురం ఉమ్మడి జిల్లాల ఎన్.హెచ్.ఆర్.పి.ఎఫ్ నాయకులు కార్యవర్గ సభ్యులు తప్పక హాజరై రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, రాష్ట్ర కన్వీనర్ డా.విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జోనల్ అధ్యక్షుడు ఈశ్వరప్ప, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శివప్ప, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి దినేష్, అనంతపురం సత్యసాయి ఉమ్మడి జిల్లాల మండల ఎన్.హెచ్.ఆర్.పి.ఎఫ్ నాయకులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ నూతన గ్రామ కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**యాడికి, ఆగస్టు 16 ప్రభాతవార్త**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావు మాదిగ, కో ఇన్‌చార్జ్ కోళ్ల కళ్యాణ్ మాదిగ సూచన మేరకు ఆదివారం నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. యాడికి మండల ఇన్‌చార్జ్ ఎంపి పుల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో యాడికి మండలం తూట్రాళ్లపల్లి, రాయలచెరువు గ్రామాల్లో గ్రామ కమిటీలు వేశారు. 30 సంవత్సరాలుగా మందకృష్ణ పోరాటం చేసి ఏబిసిడి ఎస్సీ వర్గీకరణ సాధించడం జరిగిందన్నారు. వర్గీకరణ ఫలాలు మనమంతా అనుభవించాలంటే మన పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఉద్యోగాలు వచ్చేవరకు మంద కృష్ణ నాయకత్వంలో భాగస్వాములై 30 సంవత్సరాల పోరాటానికి గుర్తుగా పని చేయాలని తెలియజేయాలని నాయకులు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల నూతన గ్రామ కమిటీల ఇన్‌చార్జ్ ఎంపి పుల్లయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు లింగాల గుర్రప్ప మాదిగ, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు నరసింహులు మాదిగ, సూర్యుడు మాదిగ, చిన్న రాముడు మాదిగ, నారాయణస్వామి మాదిగ, ప్రవీణ్ మాదిగ, శివప్రసాద్ మాదిగ, నాగరాజు మాదిగ, చిన్న మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌మెర్సిబుల్ పంపు, మోటారు చోరీ

- నన్ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు కక్షకట్టారంటున్న బాధితరైతు ఫారూఖ్

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 16, ప్రభాతవార్త**

మండలంలోని దాదిరెడ్డిపల్లి సోమావతి నదికి సమీపంలో ఉన్న బావికి అమర్చిన సబ్‌మెర్సిబుల్ పంపు, మోటారును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతు షేక్ ఫారూఖ్ వాపోయాడు. దాదిరెడ్డిపల్లి వద్ద ఉన్న తనకున్న 4.25 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, నీటి బావి, మరో బోరు ద్వారా వచ్చే నీటితో కొబ్బరి చెట్లు, మామిడి చెట్లు, మొక్కజొన్న, వేరుశనగ, టమోటా, మిరప తదితర పంటలను సాగుచేసుకుంటున్నాడు. కాగా శుక్రవారం రాత్రి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన పొలంలోకి చొరబడి బావికి అమర్చిన సబ్‌మెర్సిబుల్ పంపు, మోటారు దొంగలించుకువెళ్లారన్నాడు. వీటి విలువ దాదాపు రూ 40 వేల వరకూ ఉంటుదన్నాడు. చుట్టుపక్కల రైతులను విచారించినా ఫలితం లేదన్నారు. అయితే ఈ దోపిడికి ముగ్గురు లేక నలుగురు వ్యక్తులు పాల్గొని ఉంటారన్నాడు. దొంగల పాదముద్రలు సైతం చోరీ ప్రదేశంలో స్పష్టంగా కన్పిస్తున్నాయన్నారు. గతంలో కూడా నాపంటకు నిప్పుపెట్టడంతో కేబుల్ వైర్లు, డ్రిప్పు పరికరాలు, కొన్ని వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయన్నాడు. నన్ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నట్లు అనుమానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు ఫారుఖ్ తెలియచేశాడు.

# రౌడీ షీటర్లలో మార్పు రావాలి

- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు - ఎస్.ఐ. కె.ప్రసాద్

**శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త**



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ కె.ప్రసాద్

మండల పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.ప్రసాద్ కౌన్సి లింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా రౌడీ షీటర్‌ను పిలిపించి ప్రత్యేకంగా హెచ్చరించి నట్లు తెలిపారు. ఎవరైనా సరే చట్ట కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, పాత పెద్దతిని వీడి జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంతంగా జీవించాలని వారికి హితవు పలికారు. మళ్లీ నేరాల్లోకి దిగినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# వివాహానికి ఆర్థిక సహాయం అందించిన కేశవరెడ్డి



వివాహానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

**గార్లదిన్నె,ఆగస్టు 16,ప్రభాతవార్త**

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గార్లదిన్నె మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన ముత్యాలప్ప కుమారుడు మురళి వివాహానికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు తనవంతు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. మురళి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రావణ మాసంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

**గార్లదిన్నె, ఆగస్టు 16,ప్రభాతవార్త**



మండలంలోని కోటంక గుంటికింద కొలువైన శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రధాన అర్చకులు వైద్యం రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతి ఇచ్చారు.శ్రావణ మాసంలో స్వామివారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. దీంతో గార్లదిన్నె మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి తమ కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# అక్రమ ఇసుక టిప్పర్‌ను స్వాధీనం

**శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త**



స్వాధీనం చేసుకున్న టిప్పర్‌తో పోలీసులు

మండల పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక టిప్పర్‌ను శింగనమల పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. కె.ప్రసాద్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భవిష్యత్తులో ఇలాంటి దాడులు ముమ్మరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించిన ఎమ్మెల్యే

**శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త**



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని దుర్గాంజినేయ స్వామి కొండపై 10 సంవత్సరాలుగా అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంకులను ఆదివారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుభ్రం చేయించారు. గత 10 సంవత్సరాలుగా కొండపై ఉన్న రెండు నీటి ట్యాంకులు పూర్తిగా నీటిని వాడకుండా వుండటంతో పాచి పట్టి, అపరిశుభ్రంగా తయారయ్యాయి. స్థానికంగా గత నెల రోజుల నుంచి మండల కేంద్రంలో నీటి సమస్య ఏర్పడటంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించి నీటి సమస్య పరిష్కారానికి రెండు ట్యాంకులను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ రెండు ట్యాంకుల్లో నీరు పూర్తిగా నింపి వదలడం వల్ల గ్రామంలో ఏర్పడ్డ నీటి ఎద్దడికి పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆసుపత్రికి వెళ్లే దారి సూచిక బోర్డు మరమ్మత్తు చేయాలి

**శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త**



కింద పడిన సూచిక బోర్డు

మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు దారిని సూచించే సూచిక బోర్డు విరిగిపోయి కిందికి పడి వుండటంతో, ఇతర గ్రామల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొత్తగా ఆసుపత్రికి వచ్చే వారికి దారి గుర్తించడం కష్టంగా ఉంటుందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విరిగిపోయిన బోర్డును మరమ్మత్తు చేయడంతోపాటు అవసరమైతే కొత్త సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# హేమావతి సిద్దేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ విశేష పూజలు



జిల్లా ఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

**అమరాపురం ఆగస్టు 16 ప్రభాతవార్త**

మండల పరిధిలో పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హెజేరు సిద్ధేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ దంపతులు విశేష పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ ఆలయ అర్చకులు శివకుమార్ స్వామి, సిద్దలింగేశ్వర స్వామి లు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం అర్చనలతో పాటు విశేష పూజా కార్యక్రమాలను జిల్లా ఎస్పీ దంపతుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం యొక్క విశిష్టతను ఆలయ అర్చకులు జిల్లా ఎస్పీకి వివరించారు. పురాతన చరిత్ర కలిగిన ఆలయ విశిష్టతను ఎస్పీ తెలుసుకొని స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మరియు స్థానిక టిడిపి నాయకులు గొల్లమారనపల్లి రామచంద్రప్ప, నాగరాజు, దయానంద్ తదితరులు ఘనంగా ఎస్పీ దంపతులను సన్మానం చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ దంపతులు మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ , అమరాపురం ఎస్సై వలి భాష సమక్షంలో వెళ్లి పురాతన కాలంనాటి విగ్రహాలను శిలాశాసనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, కానిస్టేబుల్ లు శ్రీరంగప్ప, రమేష్, దాదా పీర్, మహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# శుభ్రత-పచ్చదనం అనేది ప్రతిఒక్కరి బాధ్యత

## -కమిషనర్ జస్వంతరావు



కెనాల్ చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, పాల్గొన్న స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

**అనంతపురం ఆగస్టు16 ప్రభాతవార్త**

నగర పరిశుభ్రత-పచ్చదనం అనేది ప్రతిఒక్కరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. ఆదిఆరం హెచ్ఎల్సి కెనాల్ వద్ద క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని డిస్కవరీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కెనాల్లో కొట్టుకొచ్చిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ యువత, స్వచ్ఛంధ సంస్థలు, సామాజిక స్పృహ వున్నటువంటి వాళ్లు ప్రజలకు అవగాహన కల్పించి నగరాన్ని పరిశుభ్రంగా వుంచేలా చూడాలని పిలుపునిచ్చారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటివద్దకు వచ్చే వాహనాల్లో వేయడంతో పాటు నిర్ధేశించిన ప్రాంతాల్లోనే వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా సమస్యలు వుంటే సంబంధిత శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు లేకుంటే కమాండ్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. కెనాల్లో చెత్త తొలగింపు కార్యక్రమంలో ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమి రాచనపల్లి విద్యార్థులు, గ్రీన్ ఆర్మీ సోహాల్నంద, ఇన్నర్వీల్ క్లబ్ శ్రీవల్లి, రోటరీ క్లబ్ సుధీర్, హరియన్ స్కూల్ ప్రిన్సిపల్ లహరి, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి (ఎం.హెచ్.ఓ0 డాక్టర్ రాజా రవీంద్రనాథ చౌదరి, శానిటరీ ఇన్స్పెక్టర్ విజయ్కుమార్, గోపాల్, 50వ డివిజన్ టిడిపి ఇన్చార్జ్ టైలర్ శ్రీనివాసులు, ఎస్సీ,ఎస్టీ జెపిసి నాయకులు సాకే హరి, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



# రూ, 5 లకే కడుపు నిండా భోజనం

### అన్న క్యాంటీన్ పనులను పరిశీలించిన వెంకటేశ్వరరావు.
### సొంత ఖర్చులతో పేదల కడుపు నింపేందుకు క్యాంటీన్ ఏర్పాటు.
### పాల్గొన్న టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి.



క్యాంటీన్ పరిశీలిస్తున్న టిడిపి నాయకులు.

**గోరంట్ల ఆగస్టు 16 ప్రభాత వార్త**

గోరంట్ల పట్టణంలోని బస్టాండ్ వద్ద మంత్రి సవితమ్మ సొంత ఖర్చులతో గోరంట్ల పట్టణ పేద ప్రజల ఆకలి తీర్చేందుకై నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్ పనులు నిర్మాణ పనితీరు వంటి వాటిని ఆదివారం మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేగవంతంగా నాణ్యమైన పనులు పూర్తిచేసి త్వరలోనే గోరంట్లలో మొదటిసారిగా అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని ప్రభుత్వం మంజూరు చేసే అన్న క్యాంటీన్ మంజూరు అయ్యే వరకు సొంత ఖర్చులతో గోరంట్లలో పేదలకు 5 రూపాయల తో భోజనం అందిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్, పార్టీ సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్, మార్కెట్ డైరెక్టర్ దేవంగం శ్రీనివాసులు, రవీంద్ర నాయక్, నాగే నాయక్, గిరిధర్ గౌడ్, కురుబ మల్లికార్జున, గుమ్మయ్య గారి పల్లి హరి, వృషభ దేవుడు,ఉమర్ ఖాన్, పసుపులేటి శ్రీనివాసులు, నబి రసూల్, సుభహాన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీపతి, వాల్మీకి సోము, డీల రమేష్, రోహిత్, గుమ్మయగారి పల్లి ప్రకాష్, డీలర్ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# టిఈటి రద్దు కోరితే సస్పెండ్ చేస్తారా..?





**పుట్టపర్తి, ఆగస్టు 16, ప్రభాతవార్త**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయ లకు అర్హత పరీక్ష టి ఈ టి రద్దు చేయాలని కోరుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రిని కలిసి తమ సమస్యను విన్నవించుకున్న ఐదుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం శోచనీయమని వైయస్సార్ టి ఏ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బివి రమణారెడ్డి, బడ హరి ప్రసాద్ రెడ్డిలు మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో సమస్యల పైన మంత్రులను అధికారులను , ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రం సమర్పించడం ఉపాధ్యాయ సంఘాల నాయకులుగా వారి కనీస కర్తవ్యం అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని ఐదుగురు ఉపాధ్యాయ సంఘ నాయకులను క్రమశిక్షణ చర్యల పేరుతో సస్పెండ్ చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. 20 నుండి 30 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి ఇప్పుడు టి ఈ టి పేరుతో మానసిక వేదనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగ భద్రత, సర్వీస్ నిబంధనల పేరుతో ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ఈ ప్రభుత్వం వేధింపులకు పాల్పడడం మానుకోవాలని లేనిపక్షంలో కలిసివచ్చే ఉపాధ్యాయ సంఘాలు ప్రజాస్వామ్య వాదులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# పేకాట రాయుళ్ళు అరెస్టు

**డి.హిరెహాళ్ ఆగస్టు16 ప్రభాతవార్త**

పేకాట రాయుళ్ల 8 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ.గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ అందించిన వివరాల మేరకు ఆదివారం డి.హిరెహాళ్ మండలం మల్లికేతి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు చెప్పారు. ఆ ఎనిమిది మందిని పట్టుకొని వారి వద్ద నుండి రూ.10,150ల నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్.ఐ. తెలిపారు. పేకాట రాయుళ్లందరు మల్లికేతి గ్రామానికి చెందినవారని ఆయన చెప్పారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ గంగన్న, కానిస్టేబుళ్ల నాగరాజు, రామాంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి, మారెమ్మ దేవతల విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని



గజ స్తంభానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దృశ్యం

**బ్రహ్మ సముద్రం, ఆగస్ట్ 16 ప్రభాతవార్త**

మండలపరిధిలోని యనకల్లు గ్రామంలో జరుగుతున్న గణపతి, శ్రీ ఆంజనేయ స్వామి, మారెమ్మ, నాగసహిత బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు టీడీపీ నాయకులు, పెరవలి పారా విశ్వనాథ్ విచ్చేసారు గ్రామ ప్రజలువీరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని ఆంజనేయుడికి, గణపతి, మారెమ్మలకు, ధ్వజస్థంభం, కళషాలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు గ్రామస్థులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును ఘనంగా సత్కరించి నాయకులకు సన్మానం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో శాసన సభ్యులు అమిలి నేని సురేంద్ర బాబు మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ మల్లికార్జున కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



పల్లకి మోస్తున్న వేణురెడ్డి తదితరులు

**హిందూపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త**

హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయతీ వీవర్స్ కాలనీలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల వారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ముఖ్య నేత గుడ్డంపల్లి వేణురెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి సీతారాములు కొలువుదీరి పల్లకిపై విహరించగా వేణురెడ్డి తదితరులు పల్లకి మోస్తూ జై శ్రీరామ్ అంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, రాష్ట్ర వాలంటీర్ల విభాగం ప్రధాన కార్యదర్శి వరుణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ధనుంజయ రెడ్డి, మంజునాథ్, మాజీ వైస్ సర్పంచ్ నరేంద్ర, నాయకులు హనుమంత రెడ్డి, హేమంత్ రెడ్డి, ప్రభాకర్, రామాంజి, గోపాల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 53 సంవత్సరాల తర్వాత ఒకటైన నేస్తాలు




ఒకటైన నేస్తాలు

**కనేకల్ ఆగస్టు 16 ప్రభాతవార్త**

పాఠశాలలో తమ స్నేహితులతో చదివిన చదువులు చేసిన అల్లర్లు ఆనాటి జ్ఞాపకాలను 53 సంవత్సరాలు తర్వాత అంటే దాదాపు 70 సంవత్సరాల వయసులో ఆనాటి స్నేహితులంతా ఒకటై ఆటపాటలతో అలనాటి తీపి జ్ఞాపకాలతో ఉల్లాసంగా గడిపారు. కనేకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నందు 1973.74 చదివిన విద్యార్థులు విద్యార్థిని లు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో ఆదివారం కలుసుకున్నారు. 53 ఏళ్ల తర్వాత కలుసుకున్న 197374,బ్యాచ్ పూర్వ విద్యార్థులు. వారి కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఒక కుటుంబంలో రోజంతా గడిపారు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో ఈ వయసులో కూడా ఉల్లాసంగా స్టెప్పులు వేస్తూ తోటి స్నేహితులను ఆనందపరిచారు అలనాటి స్నేహితులు. 53 సంవత్సరాలు తర్వాత తమ స్నేహితులను కలుసుకోవడం మారుతూ గడపడం చాలా సంతోషంగా ఉందని ఈరోజు తమ జీవితంలో మర్చిపోని రోజు అని పూర్వ విద్యార్థులు అన్నారు.

# నూతిమడుగు పాఠశాలల్లో తీరిన నీటి సమస్య..

**కంబదూరు, ఆగస్టు16, ప్రభాతవార్త**

కంబదూరు మండలంలోని నూతిమడుగు ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల, జడ్పీ హైస్కూల్లో నెలకొన్న నీటి కొరత సమస్య ఎట్టకేలకు తీరింది. నీటి సమస్యను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయప్ప, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్రెడ్డి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం రెండు బోర్లు వేయించగా, ఒక బోరులో పుష్కలంగా నీరు లభించింది. నూతిమడుగు టీడీపీ నాయకుల సహకారంతో ఆదివారం బోరుకు మోటార్ బిగించారు. దీంతో రెండు పాఠశాలలకు సమృద్ధిగా నీరు అందుబాటులోకి వచ్చింది. నీటి సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుద్ఘాతంతో బేల్దారి కూలీ మృతి..

**కంబదూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త**



విదుద్ఘాతంలో మృతి చెందిన వెంకటేష్

కంబదూరు మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామంలో నూతన ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి ముదిగల్లు గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ (58) ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై లోకేష్ వివరాలు వెల్లడించారు. జెక్కిరెడ్డిపల్లికి చెందిన గొల్ల బాలకృష్ణకు చెందిన నూతన ఇంటి నిర్మాణ పనుల కోసం బేల్దారి సోమనాథ్ ముదిగల్లు గ్రామం నుంచి నలుగురు కూలీలను తీసుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. ఇంటి పైభాగంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో వెంకటేష్ విద్యుద్ఘాతానికి గురై మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అనంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేష్ పేర్కొన్నారు.

# కరాటేలో...గోరంట్ల విద్యార్థుల ప్రతిభ



విజేతలైన కరాటి విద్యార్థులు.

**గోరంట్ల ఆగస్టు 16 ప్రభాతవార్త**

కర్ణాటక రాష్ట్రం గౌరి బిదనూర్ సెయింట్ ఆన్స్ స్కూల్ ఆవరణలో జరిగిన 8వ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్లో గోరంట్ల కు చెందిన గోన్షిరో కరాటే అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాలలో పాల్గొని కటా విభాగం లో ప్రథమ బహుమతులుపూర్వజ్, మాధవి,రూప శ్రీ,,లాస్య శ్రీ, శ్రవణ్,ఖాద్రి చౌదరి,ఓం స్వరూప్,తనూష పూర్ణ శ్రీ,,హాస్వీక,కుందన శ్రీ, లు పొందగాతమోజ్ఞ, ప్రేమ్ నిహాల్, తన్విష్, శశాంక్, తరుణ్, రిషిత, అయాన్ ,రిషి కిరణ్, సమర్ , ద్వితీయ బహుమతులు, తపస్వీ,హన్విక,సూర్య, యధిస్టర్, సెహన్యా, ప్రవస్థి లు తృతీయ బహుమతిలు పొందారు కుమితే( స్పారింగ్) లో సూర్య తేజ్,కుందన, హాస్వీక లు ప్రథమ బహుమతి పొందగా, ద్వితీయ బహుమతి తమోజ్ఞ, తన్విష్, శశాంక్, పూర్వజ్, సెహన్యా , రిషి కిరణ్, ,కౌశల్, ,లాస్య శ్రీ,రోహన్ చౌదరి,నహియన్ లు పొందగా ప్రవస్థి,శ్రవణ్,వీక్ష శాన్వి,ఆహిల్ ,జ్ఞాన కృతి కీర్తి,హన్విక,రూపశ్రీ,హృదిత్య రిషి యోగ్ , ఖాద్రి చౌదరి,,ఓం స్వరూప్ , సమర్, తరుణ్, ,రిషిత, ప్రేమ్ నిహాల్ యుద్ధిష్టర్, తపస్వీ, మాధవి తనూష పూర్ణశ్రీ లు తృతీయ బహుమతి

**..రైఫిల్ షూటింగ్ లో ప్రథమ స్థానంలో..**

శశాంక్, మోహిత్ పటేల్, ద్వితీయ స్థానంలో సూర్య తేజ్, సమర్, తృతీయ స్థానంలో తన్విష్ ,యుదిస్టర్ , నిలిచారని విజయం సాధించిన విద్యార్థులను , వారికి ట్రైనింగ్ ఇచ్చిన కరాటే మాస్టర్ రాజేష్ కుమార్ ని, ఇన్ స్ట్రక్టర్స్ ఆరీఫ,తోరణ దీక్ష, విష్ణుప్రియ,వెన్య సొపర్ణిక లను ఎస్పీవీఎం డిగ్రీ కళాశాల యాజమాన్యం తో పాటుగా ప్రిన్సిపాల్ భక్తవత్సలం గారు ప్రత్యేకంగా అభినందించారని నిర్వాహకులు త్రివిక్రమ్, శ్రీదేవి లు తెలిపారు

# మయూర వాహనంపై విహరించిన వీరభద్రుడు

## -భక్తిశ్రద్ధలతో బిల్వార్చన, దేవీ, సుబ్రమణ్య హోమాలు



వైభవంగా జరుగుతున్న మయూర వాహనోత్సవం



సుబ్రమణ్య హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గం లోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం శ్రావణ చవితి ఆదివారం స్వామివారు మయూర వాహనంపై విహరించారు. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా తీర్చిదిద్దిన మయూర వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం అర్చకులు సుప్రభాతసేవ మోదలు వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లకు అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, బిల్వార్చన, దేవీ హోమం, మంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం సుబ్రమణ్య హోమం మంత్రపుష్పం కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్కుమార్, ఉత్సవ దాతలు బల్లనగుడ్డంకు చెందిన దొడ్డ బసవనగౌడ్, నందిని దంపతులు, బళ్లారికి చెందిన భువనగిరి మల్లికార్జున, సుజాత దంపతులు, బళ్లారికి చెందిన వీరభద్రప్ప ఆచారి, పుష్పావతి దంపతులు, పాల్తూరు చెందిన పి.శశిధర్గౌడ్, చేతన దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బంజారాలకు దేశవ్యాప్తంగా ఒకే రిజర్వేషన్ అమలు చేయాలి



జోడో యాత్ర ప్రారంభించిన దృశ్యం

**గుత్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా ఉన్న 17 కోట్ల మంది బంజారా, గిరిజన సమాజానికి ఒకే రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని భారత్ గోర్ బంజారా జోడోయాత్ర ట్రస్టు సభ్యులు డాక్టర్ ఎస్.కె మహేష్, రాముసాయక్, చౌహాన్లు డిమాండ్ చేశారు. బంజారాల ఐక్యత హక్కుల సాధన కోసం చేపట్టిన జోడో యాత్ర ఆదివారం సేవా ఘడ్ నుండి ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్కు, మాత జగదాంబకు, ప్రత్యేక పూజలు గావించారు. బంజారాల ఐక్యత, హక్కుల సాధన కోసం ఈ యాత్ర ఢిల్లీకి చేరుకొని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని వారు పేర్కొన్నారు. ఈ యాత్రను ఎస్.కె యశవనాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బంజారా నాయకులు పాల్గొన్నారు.

# 3వ విడత కౌన్సిలింగ్కు దరఖాస్తుల ఆహ్వానం

## - ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ యం.రామారావు



ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యం.రామారావు

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

ఉరవకొండ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2026-27 విద్యా సంవత్సరానికి మిగిలిపోయిన సీట్ల భర్తీకై 3వ విడత కౌన్సిలింగ్ జరుగుతుందని వివిధ ట్రేడ్లలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు ఈనెల 19వ తేదీలోపు ఆన్లైన్ వెబ్సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ యం.రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్క విద్యార్థి 19వ తేదీలోగా ఉరవకొండ ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికేట్లను వెరిఫికేషన్ తప్పక చేయించుకోవాలన్నారు. 20వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభమయ్యే అడ్మిషన్ల కౌన్సిలింగ్కు సర్టిఫికేట్లు వెరిఫికేషన్ పూర్తి అయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్కు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు మొబైల్ నంబర్లు: 99851 46746, 81062 75719లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ యం.రామారావు సూచించారు.

# ఆదర్శ పాఠశాలలో ఖాళీలకు ఆహ్వానం

**అగళి, ఆగస్టు 16 ప్రభాతవార్త**

అగళి ఆదర్శ పాఠశాలలో పిజిటి, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు అర్హులైన వారు సోమవారం నుండి ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆదర్శ పాఠశాలలను డెమో నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. నెలకు రూ.12 వేలు జీతం అని ఇది గెస్ట్ ఫ్యాకల్టీ అని తెలిపారు. అదేవిధంగా ఇనగలూరు ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంట్ పోస్ట్, పి.బ్యాడిగర ఉన్నత పాఠశాలలో హిందీ పోస్టు, ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు ఎంఈఓ లు నాగేంద్ర, చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులను ఈ నెల21వ తేదీలోగా ఎమ్మార్సీ లు అందజేయాలని వారు తెలిపారు. ఈ దరఖాస్తులను డీఈఓ ఆఫీస్కు పంపి ఎంపిక చేస్తామన్నారు. 8 నెలల పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగ నిర్వహణ ఉంటుందని నెలకు పదివేల రూపాయలు జీతం అని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగులు సద్వినియం చేసుకోవాలన్నారు.